క్లుప్తంగా

అభాగ్యులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల అభాగ్యులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలుస్తోందని సర్పంచ్ వంగ పద్మ అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న మడూరులో మంత్రి దయాకర్‌రావు సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి రూ. 42,500 చెక్కులను లబ్ధిదారుడు గాదరి వీరాస్వామికి అందజేశారు. ఉపసర్పంచ్ యాదగిరి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జనగామ సంతోష్, మండల నాయకులు వంగ అర్జున్, వెంకటేశ్వర్లు, బెజుగం ఐలయ్య, మేడ సోమనర్సయ్య, అంజయ్య పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బచ్చన్నపేట: ప్రభుత్వ ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉన్న సీపీఎస్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు చంద్రశేఖర్‌రావు, బందారం లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ మేరకు ఈ నెల 12వ తేదీన తలపెట్టిన ధర్నాలు, ర్యాలీలకు సంబంధించిన కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కృష్ణమూర్తి, నోడల్ అధికారి మూర్తి, కాంప్లెక్స్ హెచ్‌ఎం ముత్తయ్య, నాయకులు కనుకయ్య, అంకుశావళి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

రఘునాథపల్లి: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పురం యుగేందర్‌ను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూల బొకే అందజేసి శాలువా కప్పి సత్కరించారు. జిల్లా రైతుబంధు సమితి సభ్యులు మారుజోడు రాంబాబు, సర్పంచ్‌లు యాదగిరి, సురేందర్‌రెడ్డి, కొమురయ్య, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ శివారులో ఉన్న ప్రభుత్వ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.రేణుక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూపులో 20 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 8 సీట్లు ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులన్నారు. దరఖాస్తులకు ఈనెల 16 గడువు తేదీగా నిర్ణయించామని, పూర్తి వివరాల కోసం కస్తూర్బా విద్యాలయంలో సంప్రదించాలన్నారు.


నేటి నుంచి గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ

కొడకండ్ల: గృహలక్ష్మి పథకానికి బుధ, గురువారాల్లో మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ పరావస్తు శేషాద్రిసూరి ప్రకటనలో తెలిపారు. ఆర్‌సీసీ బిల్డింగ్ ఉన్న వారు అర్హులు కారని, సొంత స్థలం ఉన్న నిరుపేదలు దరఖాస్తులు చేసుకోవాలని, సొంతస్థలం డాక్యుమెంట్, ఆధార్, ఫుడ్‌సెక్యూరిటీ కార్డులు జత చేసి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన అన్నారు.

వారసత్వ భూమిపై హక్కు కల్పించాలి

బచ్చన్నపేట: ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ పట్టా భూమిపై వారసత్వపు హక్కులు కల్పించాలని మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన వారసులు నీల శ్రీనివాస్, నీల మల్లేశం, కృష్ణమూర్తి కోరారు. మంగళవారం వారు మండల కేంద్రంలో మాట్లాడారు. గ్రామ శివారులోని 174 సర్వే నంబర్‌లో తాతలకు 1997లో ప్రభుత్వం అసైన్డ్ పట్టాలను చేసి భూమి అందించిందన్నారు. అన్నెబోయిన మల్లయ్య, చిన్న మల్లయ్య, పెద్ద మల్లయ్య, నీల మల్లయ్య, గిరబోయిన రామయ్య, చెంద్రయ్యల పేరు మీద ఒక్కొక్కరు ఒక ఎకరం చొప్పున పట్టా పొందారని చెప్పారు. వారి వారసులం అయిన తమకు ఆ భూమిపై వారసత్వ యాజమాన్య హక్కులను కల్పిస్తూ పట్టేదారు పాసుపుస్తకాలు అందించాలని కోరారు. వారసులు సిద్దులు, మహేందర్, ఆగయ్య, రవీందర్, అజయ్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి



రమేష్ (ఫైల్)

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పబ్బ రమేష్ (59) అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. రెండు రోజుల క్రితం జ్వరంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అందరితో కలివిడిగా ఉండే రమేష్ మృతిపట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో రమేష్ ముందు నిలిచాడని గ్రామస్తులు కొనియాడారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు శేఖర్ ఉన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవర్ధన్

నర్మెట: తలపెట్టిన అభివృద్ధి పనులను, నూతన పంచాయతీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున మంజూరైన అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని, ఇటీవల కురిసిన వర్షాలకు గండ్లు పడిన రోడ్లు, కల్వర్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని తెలిపారు. ఆయాశాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. పూర్తిగా దెబ్బతిన్న వెల్దండ, అమ్మాపురం ఉన్నత పాఠశాలలను ఉన్నతాధికారులు చొరవ చూపి మరమ్మత్తులు చేపట్టాలని ఎంపీటీసీ లింగాల లక్ష్మి, నోడల్ అధికారి ఇర్రి వెంకట్ రెడ్డి కోరారు. గ్రామాల్లో ప్రమాదకరంగా మారిన ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చాలని సభ్యులు కోరారు. లేబర్ కార్యాలయంలో మధ్యవర్తుల జోక్యంతోనే పనులు జరుగుతుతన్నాయని జెడ్పీటీపీ మాలోత్ శ్రీనివాస్ ప్రస్తావించగా కార్మికులు మధ్యవర్తులను ఆశ్రయించరాదని వారి సమస్యలు, బీమా నమోదు విషయంలో నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కుమారస్వామి తెలిపారు. పండ్లతోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహమందిస్తుందని, రైతులు ఆదిశగా అడుగులు వేయాలని ఏపీఓ రమాదేవి కోరారు. సమావేశంలో జెడ్పీ కోఆప్షన్ ఎండి గౌస్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కళ్యాణం మురళి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామిని శివరాజ్, ఎంపీడీఓ ఖాజా మొహిఉద్దీన్, డీటి బత్తుల నరేష్, ఏఓ ధరావత్ సంతోషి, పీఆర్ఏఈ ప్రదీప్, పశువైద్యాధికారి డా. సర్వట్‌వార్ నేహ, విద్యుత్ ఏఈ నర్సింహులు, ఐసీడీఎస్ సునితాదేవి, ఎంపీఓ అరవింద్, ఏపీఎం నాగేశ్వర్ రావు, నీటిపారుదల శాఖ జి.వెంకన్న, ఐబి ఘని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్లాట్ పత్రాల అందజేత



స్లాట్ పత్రాలు అందజేస్తున్న నాయకులు

జనగామ: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆధ్వర్యాన ఉచితంగా అందిస్తున్న డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ పత్రాలను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యువతకు అందజేశారు. జనగామ మండలం వెంకిర్యాల గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని 50 మంది యువతకు డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ భూరెడ్డి ప్రమోద్ రెడ్డి, మండల బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు ఇరుగు యాకన్న, మండల యూత్ అధ్యక్షుడు దేవునూరి సతీష్ నాయకులు ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి



శిక్షణ పొందిన వారికి సూచనలిస్తున్న అధికారి

చిల్పూరు: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా శిక్షణ పూర్తిచేసుకున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు చదువులో వెనకబడిన విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని నోడల్ అధికారి, చిన్నపెండ్యాల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పుప్పాల రవీందర్‌రావు అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల క్లస్టర్‌లో 3 రోజుల పాటు నిర్వహించిన తొలిమెట్టు కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మైక్రో అబ్జర్వర్ పల్లగుట్ట హెచ్‌ఎం నరసింహరెడ్డి, మంజుల, అశోక్, అంజనీదేవి, శ్రీదేవిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం సాధించాలి



నాయకులతో మాట్లాడుతున్న ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయబావుటా ఎగురవేయాలని, ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఇందిర డివిజన్ కేంద్రంలోని సీనియర్ నాయకులు డాక్టర్ జైహింద్‌రాజ్, చింతకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో పాటు ఇప్పగూడెంలోని కత్తుల కట్టయ్య తదితర సీనియర్ నాయకులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నాయకులు సుభాష్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, లింగాజీ, కీసర దిలీప్‌రెడ్డి, మంచాల ఎల్లయ్య, శిరీష్‌రెడ్డి, చింత ఎల్లయ్య, నాగయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులపై అయోమయం



చిల్పూరు: దరఖాస్తులతో ఎంపీడీఓ కార్యాలయంలో ఆశావహులు

లింగాలఘణపురం: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకొనే లబ్ధిదారులు సోషల్ మీడియాలో వచ్చిన సమాచారంతో మండలంలో అంతా అయోమయానికి గురవుతున్నారు. దరఖాస్తులు తీసుకొనేందుకు ఎంపీడీఓలకు, తహసీల్దార్లకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో జిరాక్స్ కేంద్రాల వద్ద ప్రొఫార్మాలను తీసుకొని అందుకు సంబంధించిన సర్టిఫికెట్లను జత చేసి సిద్ధం చేసుకున్నారు. ఏ కార్యాలయానికి వెళ్లినా తమకు ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదని చెప్పడంతో ఎందుకైనా మంచిదనే భావనతో అంతా సిద్ధం చేసుకొని దగ్గర పెట్టుకున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ సురేందర్, తహసీల్దార్ వినయలతను వివరణ కోరగా తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని వివరించారు.

ఆశావహుల పడిగాపులు

చిల్పూరు: గృహలక్ష్మి పథకం దరఖాస్తులకు 3 రోజులే గడువివ్వడంతో మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద దరఖాస్తులతో ఆశావహులు పడిగాపులు కాశారు. కాగా, ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు రాలేదని, తాము దరఖాస్తులు తీసుకోబోమని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. దీంతో చేసేది లేక సాయంత్రం వరకు వేచి చూసినా ఫలితం లేకుండా పోయింది.

అధికారులు వెంటనే స్పందించాలి

గృహలక్ష్మి పథకంపై అధికారులు వెంటనే స్పందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, వెంకటాద్రిపేట ఎంపీటీసీ ఎన్నకూస కుమార్ డిమాండ్ చేశారు. ఆశావహుల నుంచి దరఖాస్తులు అధికారులు తీసుకోవడంలేదని తెలిసి ఆయన వెంటనే ఎంపీడీఓ కార్యాలయం చేరుకుని మాట్లాడారు.

వైన్స్ టెండర్లపై ఉన్న శ్రద్ధ 'గృహలక్ష్మి'పై లేదు



మాట్లాడుతున్న నాయకులు

జనగామ: తెలంగాణ ప్రభుత్వానికి మద్యం దుకాణాల టెండర్లపై ఉన్న శ్రద్ధ గృహలక్ష్మి పథకంపై లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి మాజీద్ అన్నారు. మంగళవారం వారు జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం గైడ్‌లైన్స్ సరిగా లేకపోవడంతో దరఖాస్తు చేసుకునేందుకు మున్సిపల్‌కు వెళ్లిన నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దరఖాస్తుకు రెండురోజులే మిగిలి ఉండడంతో వేలాది మంది ఆందోళనకు గురవుతున్నారన్నారు. వైన్స్ టెండర్లకు 18 రోజుల పాటు గడువు ఇచ్చిన ప్రభుత్వం, గృహలక్ష్మికి సైతం నెలరోజుల పాటు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గొర్రెల పంపిణీ

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి)లో యాదవ కులస్తులకు మండల పశువైద్యాధికారి మౌనిక, ఉప సర్పంచ్ షర్ఫొద్దీన్ గొర్రెలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మంజూరైన 4 యూనిట్ల గొర్రెలను యాదవ కులస్తులకు పంపిణీ చేశామని తెలిపారు. పశువైద్య సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రం ప్రారంభించాలని వినతి

పాలకుర్తి టౌన్: పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూర్తయిన నిత్యాన్నదాన సత్రాన్ని ప్రారంభించాలని అఖిలభారత హిందూ భక్త పరిరక్షణ సమితి సభ్యుడు దుంపలి సంపత్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో దేవాదాయ ధర్మాదాయ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షుడు కామారపు సునీల్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు చేయూత



రఘునాథపల్లి: వరద ముంపునకు గురైన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి ముదిరాజ్ కులస్తులకు మండలంలోని స్ఫూర్తి ఫౌండేషన్ షిప్ సీడ్ ఫామ్ బొమ్మకూరి ప్రతినిధి ఉత్తెపు సత్యనారాయణ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందంల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. మంగళవారం మోరంచపల్లి గ్రామానికి చేరుకొని 32 ముదిరాజ్ కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేసి దాతృత్వం చాటారు. బాధిత కుటుంబాలు ఆపదలో ఆదుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు పండుగ రమేష్, భీమ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మండలానికి ఫ్రీజర్లు



పాలకుర్తి: ఇటీవల లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఎస్.వెంకటేశ్వర్‌రావు మండలానికి నాలుగు బాడీ ఫ్రీజర్లను అందజేశారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి, మహిళా క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 50 శాతం క్లబ్ నిధులు, 50 శాతం దాతల సాయంతో నాలుగు బాడీ ఫ్రీజర్లు కొనుగోలు చేసి దత్తత తీసుకున్న దర్దేపల్లి, తీగారం , విస్నూరు, చెన్నూరు గ్రామాలకు అందజేస్తున్నట్లు తెలిపారు. దాతలు సుధా టెక్నోస్కూలు చైర్మన్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ రాపాక విజయ్, జోన్ చైర్మన్ నంగునూరి రవీందర్, వీరమనేని సోమేశ్వర్‌రావు, రాఘవరావు, డాక్టర్ మంద బుచ్చిరెడ్డి, రీజియన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

100 మందికి జాతీయ జెండాలు



లింగాలఘణపురం: మండలంలోని కళ్లెంలో ఆరె భాస్కర్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది గ్రామస్తులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఇంటింటికి జెండాలను ఆవిష్కరించాలనే లక్ష్యంతో ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్, శ్రీనువాసు, రమేష్, మూర్తి, శేఖర్, రాములు, వెంకటేశ్, ప్రసాద్ ఉన్నారు.

తల్లిపాలే శ్రేష్టం

జఫర్‌గఢ్: తల్లిపాలు శిశువులకు శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు అనిత, సుజాత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని జఫర్‌గఢ్, హిమ్మత్‌నగర్, కోనాయిచలం, కూనూర్‌లలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలిలు

తరిగొప్పుల: చేనేత కార్మికులకు చేనేత మిత్ర పథకాన్ని అమలు చేస్తామని ఐటీ మంత్రి కేటీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అంకం వెంకటేష్ మాట్లాడుతూ చేనేత మిత్ర పథకం కింద ప్రతీ మగ్గానికి నెలకు రూ.3,000, హెల్త్ కార్డుల ద్వారా ఓపీ వైద్య సేవలకు రూ.25 వేలు, మృతిచెందిన కుటుంబాలకు టెస్కో సాయం కింద రూ.25 వేలు అందిస్తామని కేటీఆర్ ప్రకటించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, అమిరిశెట్టి వీరేందర్, చిలువేరు లింగం, సంజీవ పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



రుణాలు అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

కొడకండ్ల: రైతుల సంక్షేమం వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా డీసీసీబీ ద్వారా చేయూతనందిస్తున్నట్లు డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన రైతులకు డీసీసీబీ ద్వారా మంజూరైన రుణాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. డీసీసీబీ మేనేజర్ కళ్యాణి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, సర్పంచ్ మధుసూధన్, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, సుధీర్‌రెడ్డి, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్: కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలిస్తూ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీని గద్దెదింపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవనంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కేమిడి మల్లయ్య అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులను పట్టించుకోకుండా అనేక చట్టాలు తెచ్చి పేదల నడ్డి విరుస్తున్న మోదీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, బీడీ, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దేశ వ్యాప్త సమ్మెతో తగిన బుద్ధిచెప్పాలని అన్నారు. అనంతరం ఈ నెల 10వ తేదీన జరిగే మహా ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ధర్నాలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు యాకూబ్, రాములు, శ్రీశైలం, శ్రీను, సదానందం, సాయిలు, లక్ష్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

'పంచాయతీ సిబ్బంది జీవితాలతో ఆడుకోవద్దు'

నర్మెట: నిరుపేదలు, రెక్కాడితేగాని డొక్కాడని పంచాయతీ కార్మికుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకోవద్దని, తక్షణం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి వారి కుటుంబాలను ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు అన్నారు. గత 34 రోజులుగా సమ్మె బాటపట్టిన సిబ్బందికి మంగళవారం మద్దతు ప్రకటించిన పార్టీ శ్రేణులు మాట్లాడారు. గ్రామాల పారిశుద్ధ్య నిర్వహణలో దుర్గంధాన్ని భరిస్తూ సేవలందిస్తున్న పేదలను కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం విచారకరమని, మోరీల్లో చెత్తపేరుకుని గ్రామాల్లో వ్యాధులు వ్యాపించే విధంగా పరిస్థితి ఉందని, తక్షణం స్పందించి 11వ పీఆర్‌సీ ప్రకారం రూ.19 వేల నెలసరి జీతం, ప్రమాదంలో మరణించిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనిల్ కుమార్, గంగం ప్రభాకర్‌రెడ్డి, రాజు, రాజు, సిద్దులు, వినోద్, ఆంజనేయులు, శివరాత్రి రవి పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న నాయకులు

బచ్చన్నపేట: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతితో మండలంలోని చిన్నరామన్‌చర్లలో పలు సంఘాల నాయకులు మంగళవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ విప్లవ గళం మూగబోయిందని, ఆయన చేసిన సేవలను మా త్రం మరువలేనివని కొనియాడారు. ఆర్టీసీ నాయకులు బాల్‌నర్సయ్య, లాజరు, ప్రజాసంఘాల నాయకులు అశోక్, శైలజ, సుహాసిని, రమేష్, బాలయ్య, ఎల్లయ్య, భూపాల్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జహీర్ అలీఖాన్‌కు..



జహీర్ అలీఖాన్‌కు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

జనగామ రూరల్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప జర్నలిస్టు జహీర్ అలీ ఖాన్ అని టీయూడబ్ల్యూజేయూ-ఐజేయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి భిక్షపతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సియాసత్ ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీర్ అలీ ఖాన్ చిత్రపటానికి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను పర్మనెంట్ చేయండి



జనగామ రూరల్: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ 2వ ఏఎన్ఎంలకు ఎలాంటి పరీక్షలు లేకుండా పర్మనెంట్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.కవిత డిమాండ్ చేశారు. మంగళవారం విధులను బహిష్కరించి ఏఎన్ఎంలతో కలిసి కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలందిస్తున్న తమను ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా ప్రభుత్వ ఉద్యోగ భద్రత కల్పించి పర్మనెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆలయ దారి వివాదం.. సామాజిక మాధ్యమాల్లో వైరల్

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని మహాదేవస్వామి ఆలయానికి వెళ్లే దారి కబ్జాపై ప్రశ్నించిన దళితులపై సర్పంచ్ అక్రమంగా కేసులు నమోదు చేయించాడని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు సోమవారం జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేసిన వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని మంగళవారం స్థానిక దళిత నాయకుడు శాడ శ్రీనివాస్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ట్విట్టర్ ఖాతాను జత చేస్తు పోస్టు చేశారు. దళితులపై అక్రమ కేసులు నమోదు చేశాడని, తమకు సాయం చేయాలని సంజయ్‌ను శ్రీనివాస్ కోరారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

దేవరుప్పుల: పార్టీకోసం పాటుపడిన మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి లకావత్‌తండాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మూడ రమేష్ తండ్రి షాంక్రునాయక్ మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

మైదంచెరువు తండాలో..

కొడకండ్ల: మైదంచెరువుతండాకు చెందిన జాటోత్ లచ్చిరాం, జాటోత్ వర్షిత కుటుంబ సభ్యులను ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు పరామర్శించారు.

మండల కేంద్రంలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ కమ్మగాని మంజుల పరమేశ్వర్ కుమారుడు భాను ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషాదయాకర్‌రావు మృతుడి తల్లి దండ్రులు, బంధువులను పరామర్శించారు.

పరామర్శ

జఫర్‌గఢ్: తిమ్మంపేటకు చెందిన మారపాక సది అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, సర్పంచ్ మంద మల్లేశం పార్టీ బృందంతో కలిసి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అల్పాహారం అందజేత

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రిలో నిత్యం అల్పాహారాన్ని అందించడం జరుగుతుందని లయన్స్ గవర్నర్ వెంకటేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో దాతల సాయంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు



జనగామ రూరల్: అధిక శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం పట్టణంలోని 3వ వార్డులోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. 33 రకాల నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు మెరుగు సుధాకర్ సుజాత, సురేందర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.